ఇంటి నుంచి భోజనం, పుస్తకాల కోసం దర్శన్ పిటిషన్

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నటుడు దర్శన్ ఇంటి నుంచి భోజనం, పరుపు, పుస్తకాలు పొందేందుకు అనుమతులు కోరుతూ హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. జైలులో ఆహారం జీర్ణం కావడం లేదని, అతిసార బారినపడ్డానని తెలిపారు. విరేచనాలతో బరువు తగ్గానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇంటి నుంచి భోజనానికి అనుమతులు ఇప్పించాలని పిటిషన్‌లో విన్నవించారు. రేణుకాస్వామి హత్య కేసు లో ఏ1 పవిత్రగౌడ, దర్శన్‌తో కలిపి 17మంది జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.


సమీక్షా సమావేశంలో సీఎం, డీసీఎం

నకిలీ విత్తనాలపై కొరడా

- విక్రయదారులపై కఠినంగా వ్యవహరించండి
- పాల ఉత్పత్తి పెంపు ఆశాజనకం
- అటవీ ప్రాంతాల్లో భూమి హక్కులపై త్వరలోనే నిర్ణయం
- డెంగీ నియంత్రణకు టాస్క్‌ఫోర్స్
- డీసీల సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కొరడా ఝులిపించాలని, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశించారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయని, రైతులు పంటలసాగుకు సిద్ధమయ్యారని, ఎక్కడా నకిలీ విత్తనాలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంగళవారం రెండోరోజు విధానసౌధలో జిల్లా అధికారులు, జిల్లా పంచాయతీ సీఈఓలు, కార్యదర్శులతో శాఖలవారిగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 82.48 లక్షల హెక్టార్లలో విత్తనసాగు లక్ష్యమని, 50.91 లక్షల హెక్టార్లలో సాధ్యమైందని ఇంకా 32లక్షలు సాగు జరగాల్సి ఉందన్నారు. విత్తనాలు రసాయన ఎరువుల విషయంలో నకిలీలకు తావు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించామని, బంజరు భూములు, రోడ్లపక్కన మొక్కలు నాటాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల కార్డులను దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనర్హులు ఉంటే తొలగించాలన్నారు. యువ స్వావలంబనకింద యలహంక వద్ద 60 ఎకరాల విస్తీర్ణంలో క్రీడాగ్రామ నిర్మించేందుకు సౌలభ్యాలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మనమంతా ప్రభుత్వ సేవకులని అందుకే కెంగల్ హనుమంతయ్య విధానసౌధలో 'ప్రభుత్వ కర్తవ్యం - దేవుడి విధి' అని రాశారని గుర్తు చేశారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో డెంగీ జ్వరం తీవ్రమైనందున నియంత్రణకు రెండు నెలల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. బోర్డులు, కార్పొరేషన్లలో సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షుల నియామకం జరిగినా సభ్యులను ఖరారు చేసేందుకు హోంశాఖ మంత్రి పరమేశ్వర్ నేతృత్వంలో కమిటీ వేశారు. ఇదే విషయాన్ని సమావేశంలో తెలిపారు. సభ్యులుగా మంత్రులు రామలింగారెడ్డి, జార్జ్, సతీశ్‌జార్కిహోళి, సంతోష్‌లాడ్, శరణ ప్రకాశ్‌పాటిల్, ఎంపీ జీసీ చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు రూపకళ, రిజ్వాన్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీలు వీఆర్ సుదర్శన్, హరీశ్‌కుమార్‌ను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా పాలదిగుబడి పెరగడం ఆశాజనకమని అన్నారు. పాల ఉత్పత్తి పెంచేందుకు ఉపయోగించే వ్యాక్సిన్‌ను సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. పీఎం స్వనిధి ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీప్రాంతాల్లో నివాసం, ఏళ్ల తరబడి పంటలసాగు చేసే వారికి హక్కులు కల్పించే విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 2,98,798 దరఖాస్తులు స్వీకరించగా 2,58,086 అర్జీలు తిరస్కరణకు గురయ్యాయని 24,186 పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటి వరకు 16,426 హక్కుపత్రాల ద్వారా 56,479 ఎకరాల భూమిని పంపిణీ చేశామన్నారు. ఇదే సందర్భంగానే కార్యదర్శి మనోజ్ జైన్‌తో కువెంపు పాఠం గురించి ప్రస్తావించారు. గంగాకల్యాణ పథకంలో పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. డెంగీ నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ప్రగతిపై నిరంతరం సమీక్షలు జరపాలన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన మేరకు రెండువేల పంచాయతీల పరిధిలో మోడల్ స్కూళ్లను సీఎస్ఆర్ ద్వారా నిర్మించే మహత్తరమైన పథకాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ గ్రామీణ ప్రాంతాల్లో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలిపారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. బాలికలు గర్భిణీలయ్యే విధానాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సమాజంలోనూ ఇటువంటి విధానాలు సరికాదన్నారు. కొన్ని చోట్ల అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. పర్యాటకశాఖ కొత్త పాలసీని అన్ని జిల్లాల్లోనూ అమలు చేయాలని సూచించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, మునియప్ప, రామలింగారెడ్డి, జార్జ్, ప్రియాంక ఖర్గే, జమీర్ అహ్మద్‌తోపాటు చీఫ్ సెక్రటరీ రజనీశ్ గోయెల్ తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు


మీడియాతో ఎంపీ రమేశ్ జిగజిణగి

ఏడుసార్లు ఎంపీగా గెలిచినా

మంత్రి పదవి దక్కలేదు

- దక్షిణాదిలో అగ్రవర్ణాలకే పదవులు
- దళిత వ్యతిరేకిగా మారుతున్న బీజేపీ
- విజయపుర ఎంపీ రమేశ్ జిగజిణగి అసంతృప్తి

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో వరుసగా ఏడుసార్లు గెలిచి దళిత సామాజికవర్గానికి చెందిన ఎంపీగా గుర్తింపు పొందినా తనకు మంత్రిగా అవకాశం ఇవ్వలేదని విజయపుర లోక్‌సభ సభ్యుడు రమేశ్ జిగజిణగి అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయపురలో మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దక్షిణభారతదేశంలో దళిత సామాజికవర్గం నుంచి వరుసగా ఏడుసార్లు ఎంపీగా గెలుపొందిన ఏకైక వ్యక్తిని అన్నారు. అయినా కేంద్రంలో తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మంత్రి గిరీ అవసరం లేదని, కానీ తాను మంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షించారని అన్నారు. బీజేపీ దళిత వ్యతిరేకి అవుతోందని, దక్షిణాదిలో అగ్రవర్ణాలకే మంత్రి హోదాలు దక్కాయని, అలా అయితే దళితులు పార్టీకి మద్దతు ఇవ్వలేదా.. ఇది న్యాయమా..? తన మనసుకు బాధగా ఉందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.32వేల కోట్లు ఇతర పథకాలకు ఉపయోగించారని ఆరోపించారు. కర్ణాటక చరిత్రలో ఎస్సీలకు కేటాయించిన నిధులు ఇతర విభాగాలకు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిర్ణయాన్ని ఖండిస్తున్నా అన్నారు. వీటిని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప వ్యతిరేకించకపోవడం సరికాదన్నారు. గతంలో తాను రాష్ట్రమంత్రిగా ఉన్నప్పుడు ఇటువంటి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైతే రాజీనామా చేస్తానని చెప్పడంతో జేహెచ్ పటేల్ అడ్డుకున్నారని అన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై మీడియా ప్రశ్నకు సమాధానంగా మంత్రి చేత రాజీనామా చేయించారని, ఆర్థికమంత్రిగా ఉన్న సిద్దరామయ్య ఆలోచించాల్సి ఉండేదని అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్రంలో పరిణామాలపై స్పందించాల్సి ఉండేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే రోజుకో అవినీతి వెలుగులోకి వస్తూనే ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఏడాది పాలనలో అభివృద్ధి లేదని, అంతా గ్యారెంటీలకే మళ్లుతోందని విచారం వ్యక్తం చేశారు.


మంటల్లో చిక్కుకున్న బస్సు ఇదే....

ఎంజీ రోడ్డులో బీఎంటీసీ బస్సు దగ్ధం

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం
- 30 మంది ప్రయాణికులు క్షేమం

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ఎంజీ రోడ్డు అనిల్‌కుంబ్లే సర్కిల్ సమీపాన బీఎంటీసీ బస్సు దగ్ధమైంది. మంగళవారం ఉదయం 8.45 గంటలకు బస్సులో పొగ రావడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యారు. బస్సును వెంటనే ఆపేసి సుమారు 30మంది ప్రయాణికులను దించేశారు. నిమిషాల వ్యవధిలో మంటలు వ్యాపించాయి. కాసేపటి తర్వాత అగ్నిమాపకశాఖ అధికారులు రంగంలోకి దిగి మంటలు ఆర్పారు. ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడ్డంతో ఉదయం కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేవారు ఇబ్బందిపడ్డారు. ఎవరూ గాయపడకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీలో చేరేందుకు తొందర లేదు

- తండ్రీకొడుకుల చేతిలో పార్టీ సరికాదు
- మాజీ మంత్రి ఈశ్వరప్ప

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హడావిడిగా బీజేపీలో చేరాలనే ఆలోచన లేదని మాజీ మంత్రి ఈశ్వరప్ప తెలిపారు. శివమొగ్గలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయణ్ణ బ్రిగేడ్ ప్రారంభించే ఆలోచన ఉందని పేర్కొన్నారు. తండ్రీకొడుకుల చేతిలో బీజేపీ ఉండడం సరికాదని, హిందూ పోరాట నేతలకు, హిందుత్వానికి న్యాయం లభించాలనే ఎన్నికల్లో పోటీ చేశానని అన్నారు. బీజేపీలో చేరేందుకు పిలుపు వచ్చిందని తెలిపారు. వెంటనే పార్టీలో చేరాలని ఆత్రుత చూపడం లేదని, కొన్ని చర్చలు, నిర్ణయాలు జరగాల్సి ఉందన్నారు. కొందరు నాయకులు తనను కలిశారని, పార్టీలో చేరాలని సూచించారని అన్నారు. ముడా అవినీతిలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇరుక్కుపోయారని, ఇంట్లో ఉన్న మహిళలను వీధికి తెచ్చారని ఆరోపించారు. ఈ అవినీతిలో వారి కుటుంబం భాగస్వామ్యం ఉందన్నారు. సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని, సీఎం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేరుగా హిందూ సమాజాన్ని విమర్శించే ధైర్యం ఇప్పటి వరకు ఎవరూ చేయలేదని, కానీ లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు హిందువులకు బాధ కలిగించాయని అన్నారు. ప్రతిపక్ష నేత స్థానానికి గౌరవం ఉండేలా వ్యవహరించుకోవాలన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి దేశమంతటా తెలుసని, అయినా కార్పొరేషన్ ఛైర్మన్ రాజీనామా చేయలేదన్నారు. మాజీ మంత్రి నాగేంద్ర, ఛైర్మన్ బసవరాజ్ దద్దల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.




నేహ

నేహా హిరేమఠ్ హత్యకేసులో చార్జ్‌షీట్

- 483 పేజీలతో కోర్టుకు దాఖలు
- 80 రోజుల్లోనే సీఐడీ సమగ్ర దర్యాప్తు

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం కలిగించిన హుబ్బళ్లి - ధారవాడ మహానగర పాలికె కాంగ్రెస్ కార్పొరేటర్ నిరంజనయ్య హిరేమఠ్ కుమార్తె నేహా హిరేమఠ్ హత్యకేసును విచారణ జరిపిన సీఐడీ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. హుబ్బళ్లిలోని మూడో జేఎంఎఫ్‌సీ కోర్టుకు 483 పేజీలతో మంగళవారం చార్జ్‌షీట్ సమర్పించారు. విద్యానగర్‌లోని ఓ కళాశాల ఆవరణలో ఏప్రిల్ 18న సవదత్తికి చెందిన ఫయాజ్ అనే యువకుడు ప్రేమను నిరాకరించిందనే కోపంతో చాకుతో పొడిచి హత్య చేశాడు. ఇదే విషయాన్ని పోలీసుల విచారణలో అంగీకరించాడు. హత్యను ఖండిస్తూ ప్రజాసంఘాలు, బీజేపీ నిరసన తెలిపింది. కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సంఘటన తీవ్రమైనది కావడంతో రాష్ట్రప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఎస్పీ వెంకటేశ్ నేతృత్వంలో 80 రోజుల్లోనే సమగ్ర దర్యాప్తు చేశారు. డీఎస్పీ ఎన్‌హెచ్ ఫైక్ కోర్టు ముందు చార్జ్‌షీట్ సమర్పించారు.



ఏపీఎంసీ ఎన్నికల వాయిదాపై నిరసన

- జేడీఎస్ నేత నిఖిల్ కుమార్‌ను తోసేసిన పోలీసులు


బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రామనగర తాలూకా హళ్లిమాళ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) ఎన్నికలు వాయిదా వేయడంపై బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల నిరసన వివాదానికి దారి తీసింది. కార్యకర్తలకు, పోలీసులకు తోపులాట జరిగింది. మంగళవారం రామనగరలోని రెవెన్యూభవన్ ముట్టడికి పెద్ద ఎత్తున కార్యకర్తలు యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే సందర్భంగా జేడీఎస్ యువవిభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమార్‌ను పోలీసులు పక్కకి తోసేశారు. ఎన్నికలకు రెండుసార్లు ఖరారైనా అమలు చేయలేదని మండిపడ్డారు. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

తుంగభద్ర ఆయకట్టుపై

చిగురిస్తున్న ఆశలు


- వ్యవసాయ పొలాల్లో రైతులు
- వరి నార్లు వేసుకోవడంలో బిజీబిజీ

బళ్లారి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటకాంధ్ర ఉమ్మడి నీటి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్ర జలాశయం నీటితో కళకళలాడుతోంది. మలినాడు ప్రాంతం నుంచి వరద నీరు తుంగభద్రకు చేరుతోంది. తుంగ నుంచి నీరు ఉధృతంగా వస్తుండగా భద్రా జలాశయం కూడా నిండి గేట్లు ఎత్తే అవకాశం ఉంది. తుంగభద్ర జలాశయానికి నీటి ఉధృతి పెరుగుతోంది. మంగళవారం ఉదయం అధికారుల నీటి లెక్కల ప్రకారం 22.825 టీఎంసీలు చేరాయి. ఇన్‌ఫ్లో సుమారు 24వేల క్యూసెక్కులు నీరు డ్యాంలోకి చేరుతోంది. గతేడాది ఇదే నాటికి డ్యాంలో కేవలం 4 టీఎంసీలు మాత్రమే నీరు ఉండేది. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తుండడంతో పై ప్రాంతం నుంచి వరద పోటెత్తుతోంది. డ్యాంకు నీరు ఆశాజనకంగా చేరుతుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 20న కాలువలకు నీరు విడుదల చేసేందుకు ఇంతకు మునుపు జరిగిన బోర్డు సమావేశంలో ఇంజనీర్లు నిర్ణయం తీసుకున్నారు. ఆయకట్టు భూములు సాగుకు రైతులు నడుం కట్టారు. ఖరీఫ్‌లో వరి పైరుతో పాటు మిరప పంట కూడా ఆయకట్టులో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం రైతులు పొలాలు దుక్కిదున్నుకుని సిద్ధంగా ఉన్నారు. మరి కొందరు వరినార్లు బోర్లకింద ఉండే నీటితో సాగు చేసి నాట్లకు సిద్ధమవుతున్నారు. తుంగభద్ర జలాశయం కింద కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలు, ఆంధ్రాలోని అనంతపురం, కర్నూలు జిల్లాలకు ఈనెల 20న నీరు విడుదల కానున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు.


తుంగ నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


కంప్లి వద్ద రైతులు సిద్ధం చేసుకున్న వరిపైరు





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1600.99	1,576.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,079	280
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	156	252
సామర్థ్యం (టీఎంసీలు)	22.82	3.08

జిల్లావ్యాప్తంగా పంచశీల పాదయాత్ర



పంచశీల పాదయాత్రలో ముండ్రగి నాగరాజు

బళ్లారి సిటీ, జూలై 09: భారతీయ బౌద్ధసమితి తరపున పంచశీల పాదయాత్ర కార్యక్రమం బళ్లారి జిల్లావ్యాప్తంగా జరుగుతుందని డాక్టర్ బాబు జగ్జీవనరామ్ అభివృద్ధి మండలి అధ్యక్షులు ముండ్రగి నాగరాజు తెలిపారు. బీఆర్ అంబేద్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, ఆయా తాలూకాలలోని పట్టణాలు, గ్రామాలకు వెళ్ళి దళితులకు బౌద్ధమతంపై అవగాహన కల్పించాల్సిన అవసరం వచ్చిందని పేర్కొన్నారు. అంబేద్కర్ 1956లో మహారాష్ట్రలోనినాగ్‌పూర్‌లో సుమారు 10లక్షల మందితో బౌద్ధమతాన్ని స్వీకరించారన్నారు.

అనంతరం భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు హనుమేశప్ప కమలరత్న బంతేజీ మాట్లాడుతూ బుద్ధుని పంచశీల ప్రచారంలో అన్ని దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు తనను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘల నాయకులు ఎం.ఈరన్న, శ్రీమతి య యంకమ్మ, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప, బీదర్ బౌద్ధ ఉపన్యాసకులు డాక్టర్ మోర్ బీదర్ బౌద్ధ ఉపన్యాసకులు, శంకర్ , దళిత రక్షణ వేదిక లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయండి



వెలగని వీధి దీపాలు

సిరుగుప్ప, జూలై 9 : సిరుగుప్ప పట్టణ గాంధీ సర్కిల్ పక్కన వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు మండి పడుతున్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేయడంలో నగరసభ నిర్లక్ష్యధోరణి వహిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రధాన సర్కిల్‌లోనే ఇలావుంటే మురికివాడ ప్రాంతాల్లో ప్రజలు అంధకారంలో ఎలా జీవనం సాగిస్తున్నారో అర్థమవుతుందన్నారు. నగరసభ అధికారులు దీనిపై దృష్టిసారించి వీధిలైట్లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

సిరుగుప్ప, జూలై : మొహర్రం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని టెక్కలకోట ఎస్ఐ శాంతమూర్తి తెలిపారు. మంగళవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణ పోలీస్ స్టేషన్‌లో మొహర్రం పురస్కరించుకుని శాంతిసభ నిర్వహించారు. శాంతిసభలో ఎస్ఐ మాట్లాడుతూ పండుగ వేడుకల్లో ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మల్లయ్య, పోలీసులు, వైష్ణవ, శివ, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నాయకులకు మించు శ్రీనివాస్ సన్మానం



అల్లం వీరభద్రప్ప, ప్రశాంత్‌లను సన్మానిస్తున్న శ్రీనివాస్

బళ్లారిరూరల్, జూలై 9 : బళ్లారి నగరంలో లారీ అసోసియేషన్ నగర అధ్యక్షులుగా ఎన్నికైన మించు శ్రీనివాస్ మంగళవారం కేపీసీసీ మాజీ అధ్యక్షులు అల్లం వీరభద్రప్ప, మాజీ ఎంపీ కేసీ కొండయ్య, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు అల్లం ప్రశాంత్, డీసీసీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్‌లను మంగళవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా తాను ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రముఖులను సన్మానించారు. వారు కూడా మించు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్ బాషా, సభ్యులు ప్రవీణ్ కుమార్, నీలకంఠేశ్వరనాయుడు, శ్రీనివాస్, పలువురు లారీ సంఘం అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు బాడుగ భయం

● కోల్డ్ స్టోరేజీల్లో మూలుగుతున్న 40లక్షల బస్తాల మిర్చి ● సంచికి ఏడాదికి రూ.200 బాడుగ

బళ్లారి సిటీ, జూలై 09: కష్టపడి పండించిన పంట చేతికి అందిన తరువాత విక్రయించడానికి తగిన ధర లేకపోతే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించినా ధరలేక మిర్చి బస్తాలను రెండు ఏళ్లుగా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. నగరంలోని 50 కోల్డ్‌స్టోరేజీల్లో గుంటూరు మిర్చి, బ్యాడిగి మిర్చి దాదాపు 30నుంచి 40లక్షల బస్తాలు ప్రస్తుతం నిల్వ ఉంది. ధర పెరగకపోగా కోల్డ్ స్టోరేజీల బాడుగ వారికి అదనపు భారంగా మారింది. ధర పెరగక పోవడంతో పెట్టుబడులు కూడా రాక పలువురు రైతులు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం గుంటూరు రకం మిర్చి ధర క్వింటాల్‌కు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతుండగా, బ్యాడిగి మిర్చి ధర క్వింటాల్‌కు రూ.25వేలలోపు ఉందని, ఈ ధరల వల్ల ఎకరాకు తాము పెట్టిన పెట్టుబడులు కూడా రావన్నారు.

బాడుగ కూడా దండగే..

కోల్డ్ స్టోరేజీలో ఏడాదికి ఒక బస్తాకు రూ.150నుంచి రూ.200వరకు బాడుగ చెల్లించాల్సి ఉంటుంది. మరల ఐదు ఆరునెలలకు కొత్తపంట వస్తుంది. ఈనేపథ్యంలో ధరలు పెరుగుతాయా? లేదా? అన్నది తెలియడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ధర పెరగకపోతే కోల్డ్ స్టోరేజీ బాడుగ కూడా తాము అదనంగా చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రస్తుతం ధరలు పెరిగితేనే రైతులకు కోల్డ్‌సోరేజీ యజమానులకు, బ్యాంకర్లకు కూడా ఊరట లభిస్తుంది.



బళ్లారిలోని ఓ కోల్డ్ స్టోరేజీ భవనం

ప్రభుత్వ కార్యాలయాల్లో మామూళ్ల దందా

● పైసలివ్వనిదే జరగని పనులు ● లోకాయుక్తను ఆశ్రయిస్తున్న బాధితులు

బళ్లారి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. వేలాది రూపాయిల జీతాలు పొందుతూ ప్రజలకు మంచి సేవలు అందించాల్సిన అధికారులు కొందరు అక్రమ సంపాదనకు పూనుకు ంటున్నారు. ఫలితంగా ప్రజలు మామూళ్లు ఇచ్చుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ ఒకరేటు కట్టి అధికారులు తీసుకుంటున్నారు. మామూళ్లు పొందుతున్న అధికారులను మందలించి ప్రజల పక్షం నిలవాల్సిన పాలకులు మౌనంగా ఉండడం అనేక అపార్థాలకు దారితీస్తోంది. ఇటీవల కాలంలో ప్రభుత్వ కార్యాలయాలు పూర్తి అవినీతిమయంగా మారాయి. అవినీతి అధికారుల పెత్తనంతో నీతినిజాయితీ కలిగిన అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

బళ్లారి జిల్లాలో బుడా, నగరపాలికె, రిజిస్ట్రార్, పోలీస్‌స్టేషన్, రెవెన్యూ, ఇలా అన్ని ప్రధాన కార్యాలయాల్లో లంచాలు విపరీతంగా పెరిగిపోయాయనే విమర్శలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పనికీ ఒకరేటు కట్టి ప్రజల నుంచి మామూళ్లు గుంజుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

దీంతో అడిగినంత ఇచ్చుకోలేక కొందరు ఏకంగా లోకాయుక్తనే ఆశ్రయిస్తున్నారు. రెండు మాసాల క్రితం బుడాలో లేఔట్ల అనుమతికి ఏకంగా ఓ అధికారి పెద్ద మొత్తంలో మామూళ్లు అడిగాడని ఒక బాధితుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త అధికారులు బుడా కార్యాలయంపై దాడి చేసి మామూళ్లు తీసుకుంటున్న ఉద్యోగి రమేష్‌తో పాటు 12 మందిని అరెస్టు చేశారు. అలాగే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి జెస్కాం అధికారి ఆమ్యామ్యా అడుగుతున్నాడని ఒక రైతు ఫిర్యాదు చేయడంతో ఆ జెస్కాం అధికారిని లోకాయుక్త అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల బళ్లారి నగర పాలికెలో తన పొలంలో ప్లాటు వేసి రోడ్డు అప్రూవల్ కోసం అనుమతి కోరితే నగర పాలికెలో సంబంధిత శాఖ అధికారి రూ. 16 లక్షలు డిమాండ్ చేశాడని ప్రకాష్‌రావు అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త అధికారులు నగరపాలికె కార్యాలయంపై దాడిచేసి సంబంధిత శాఖ అధికార్లను పట్టుకునే లోపే సంబంధిత అధికారులు అక్కడ నుండి పరారయ్యారు.

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టానుసారం ఫీజులు వసూళ్లు చేస్తున్నారని లోకాయుక్తకు మరో రైతు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి తాండవిస్తోంది. ఏపని చేయాలన్నా మామూళ్లు తీసుకోలేనిదే ఫైలూ ముందుకు కదలడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా మండిపడుతున్నాయి. బీజేపీ నాయకులు, జేడీఎస్ నాయకులు ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి, లంచగొండితనాలపై పూర్తి స్థాయిలో మండిపడుతున్నారు. కొందరు ధర్నాలు చేస్తున్నారు. రెండురోజుల క్రితం మాజీ బుడా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి బుడాలో జరుగుతున్న అవినీతిపై ప్రెస్‌మీట్‌లో ఎత్తిచూపారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంఎం, సీపీఐ, ఏఐడీఎస్ఓ లాంటి సంఘాలు ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి పై తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. అధికార ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై మౌనంగా ఉండడం వెనుక వీరి పాత్ర ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, లంచగొండితనం సాగుతుండం పట్ల ప్రజలు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్ర ఒడ్డున అరుదైన పిల్లి ప్రత్యక్షం



తుంగభద్ర నది వద్ద కనిపించిన అరుదైన పిల్లి

కంప్లి, జూలై 9: హగరి బొమ్మనళ్లి తాలుకా నారాయణ చెరువు గ్రామ ప్రాంతాల్లో వింతపిల్లి (సీవిట్ క్యాట్) ప్రత్యక్షమైంది. అరుదైన పిల్లి కనిపించడంతో అక్కడున్న స్థానికులు దానిని వింతగా చూస్తున్నారు. ఈ జాతి జంతువులను భూమిలో పూడ్చిపెడితే వాసన పసిగట్టడమే ఈ పిల్లి ప్రత్యేకత. కొన్ని రోజుల క్రితమే ఇదే రకమైన పిల్లి మృతి చెందడంతో దానిని ఆ ప్రాంతంలో పూడ్చి పెట్టారు. దీంతో ఆ ప్రాంతాన్ని ఈ వింతైన పిల్లి తరచుగా సందర్శిస్తోందని స్థానికులు చెబుతున్నారు. నది ఒడ్డున వున్న వన్యజీవులపై అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. వన్యజీవులను హతమార్చుతున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతాల్లో నామఫలకాలు ఏర్పాటు చేసి వాటికి హాని కలగకుండా చూడాలని వన్యజీవి ప్రేమికులు తెలిపారు.

ముఖం చాటేసిన వరుణుడు

● రాయచూరు జిల్లాలో 15 శాతం దాటని సాగు

రాయచూరు, జూలై 9: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా సరైన వర్షం కురువకపోవడం రైతులకు శాపంగా మారింది. జూన్ చివరి నాటికి సాధారణంగా 40 శాతం మేరకు సాగు జరగడం ఆనవాయితీ కాగా ఈ ఏడాది 15 శాతం కూడా దాటకపోవడం గమనార్హం. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని గత ఏడాది వర్షాభావ పరిస్థితి వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చని రైతులు ఆశపడ్డారు. జూన్ మొదటి వారం నుంచి ఒకటి రెండు జల్లులు మినహా చెప్పుకోదగ్గ వర్షం ఏది కురవకపోవడంతో పూర్తిస్థాయిలో సాగు చేసేందుకు రైతులు జంకుతున్నారు. కొంతమంది రైతులు చాలీచాలని వర్షంలోనే విత్తన సాగు జరపగా అవి మొలకలెత్తి వాడు పట్టే దశకి చేరుకున్నాయి. దీంతో వర్షం రాకకోసం రైతులు ఆకాశంవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా మరికొంత మంది రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసి విత్తనాలు, ఎరువులు ఇంట్లో తెచ్చిపెట్టుకున్నా అవి నిరుపయోగంగానే మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో జూలై రెండవ వారంలో గ్రామాలు నిర్మానుష్యంగా ఉండడం, పొలాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు కనిపించడం సహజం. అందుకు భిన్నంగా ఈసారి మధ్యాహ్నం వేళ ఏ గ్రామంలో చూసినా ప్రజలు ఆరు బయట కట్టలపైనా, దేవాలయాల వద్ద లేదా రచ్చకట్ట అరుగులపైన కూర్చుని చెట్లకింద కబుర్లు చెప్పుకుంటుండడం నిత్యకృత్యంగా మారింది. ఈ క్రమంలో మరికొంతమంది రైతులు వరుణ దేవుడి రాకకోసం పూజలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.



కమ్ముకున్న మేఘాలు

వర్షభావ పరిస్థితి వల్ల గత ఏడాది పంటలు సక్రమంగా లేక అప్పుల పాలైన రైతు ఒకరు రెండురోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాన్వి తాలూకా ముద్దమగడ్డి గ్రామానికి చెందిన రైతు చన్నబసప్ప(42) గత ఏడాది చేసిన అప్పు ఈ ఏడాది మొత్తం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు చేరుతుందని అంచనా వేసుకొని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయనతో పాటు గత ఐదు నెలల నుంచి దాదాపు నలుగురైదుగురు రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. గత ఏడాది డిసెంబర్ నెలలో రాయచూరు తాలూకాలోని గోనాళ గ్రామానికి చెందిన రైతు బసవరాజ్(55) అప్పుల బాధతాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు ఇద్దరు మగ మరో ఇద్దరు ఆడ సంతానం ఉండగా చిన్నపిల్లలతో ఎలా జీవించాలంటూ భార్య రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది.

త్వరలో ఏపీఎంసీలో అభివృద్ధి పనులు



ఏపీఎంసీలో అక్రమ రోడ్డును తొలగించాలని మనవిపత్రం ఇస్తున్న వ్యాపారవేత్తలు

కంప్లి, జూలై 9 : ఏపీఎంసీ ఆవరణలో అభివృద్ధి పనులు చేసి దీనిని ఆదర్శ ఏపీఎంసీ ఆవరణగా తీర్చిదిద్దుతామని ఏపీఎంసీ అధ్యక్షులు అంజినప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొని త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని కూడా హామీఇచ్చారు. రూ. 7.10 కోట్లు నిధులు మంజూరు చేపడితే అక్కడ సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధి లైట్లు, రైతు భవనం ఏర్పాటుచేస్తే రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకోవడానికి అనుకూలంగా వుంటుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ నూతన ఏపీఎంసీ ఏర్పడిందని, ఏమి కావాలన్నా సహకారం అందిస్తామన్నారు. దీనిని జిల్లాలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ ఏపీఎంసీలోని 25 ఎకరాలలో సుమారు 91 స్థలాలు మిగిలి వున్నాయని తెలిపారు. ఇప్పటికీ అందులో 64 షాపులు ఏర్పాటు చేశారన్నారు. త్వరలో వాటి కట్టడాలు కూడా పూర్తవుతాయని తెలిపారు. వారితో పాటు ఉపాధ్యక్షులు శరణు బసవ, హబీబ్ రెహ్మాన్, గురుమూర్తి, సురేష్‌రెడ్డి, దొడ్డ మర్రిస్వామి, సురేష్‌బాబు, క్రిష్ణ, పంపాపతి, తిప్పయ్య, యల్లప్ప, ఖాసీమ్ సాబ్, కార్యదర్శి రాజు, అధికారులు సుదర్శన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందిస్తున్న ఆశాజ్యోతి సంఘం

కంప్లి, జూలై 9 : కంప్లి తాలుకా పరిధిలోని జవుకు, అంజనాపురం గ్రామాల్లో ప్రాథమిక, హైస్కూలు, రెగ్యులేటర్ పాఠశాల విద్యార్థులకు ఆశాజ్యోతి స్వయంసేవకులు బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ, భార్గవి, పద్మిని వీరమాచినేని రాధ, శ్యామ్, మమత ఎంతో సహకరించారని ఆశాజ్యోతి సంఘం ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు ఇలాంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ముందుకు రావాలని, దీక్ష, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షులు ఈరణ్ణ, పక్కీరప్ప, బసవరాజు, యంకప్ప, ఈరణ్ణ, తిమ్మారెడ్డి, వీరభద్రగౌడ, షణ్ముఖ గౌడ, శివశంకర, హనుమంతప్ప, నాగరాజు, హెచ్ఎం రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా సంగప్ప



సంగప్పను సన్మానిస్తున్న పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు అమ్మాజీ హేమన్న

కంప్లి, జూలై 9 : విజయనగర జిల్లా అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా సంగప్ప ఎంపికయ్యారు. ఆయనను పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులు అమ్మాజీ హేమన్న, లోకేష్, చంద్రశేఖర్, బాలాసాబ్, పంపాపతి నాయుడు, యర్రిస్వామిలు హోస్పేటలో జరిగిన సమావేశంలో సన్మానించి అభినందించారు. సమాజ సేవను గుర్తించే తమ నాయకుడు సంగప్ప అఖిల భారత వీరశైవ మహాసభకు ఎన్నిక కావడం తమకు సంతోషంగా వుందని బ్యాంకు అధ్యక్షులు అమ్మాజీ హేమన్న తెలిపారు. మున్ముందు వివిధ అభివృద్ధి పనులు చేసి మరింత గుర్తింపు పొందాలని కోరారు.

గొర్రెల ఫారం వద్ద చిరుత



కుక్కపై దాడి చేస్తున్న చిరుత

బళ్లారి సిటీ, జూలై 9: సండూరు తాలూకా నిడగుర్తి గ్రామపంచాయితీ గిరేనహళ్ళి గ్రామానికి చెందిన హొన్నూరస్వామి గొర్రెల ఫారం సమీపంలో చిరుతపులి కనిపించింది. గ్రామానికి 100మీటర్ల దూరంలో ఉన్న ఈ ఫారం దగ్గరవున్న పెంపుడు కుక్కను పట్టుకునేందుకు చిరుత ప్రయత్నించింది. అదృష్టవశాత్తు కుక్క తప్పించుకుని పొలం నుంచి ఇంటికి తిరిగి వచ్చింది. ఇంటికి కుక్కపరిగెత్తుకుంటూ రావడంతో అనుమానం వచ్చి పొలంలో అమర్చిన సిసీటీవీ ఫుటేజీని పరిశీలించగా సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో కుక్కపై చిరుత దాడి చేసేందుకు ప్రయత్నించిన దృశ్యం కనిపించింది. ఈ విషయాన్ని హొన్నూర్‌స్వామి అటవీ శాఖ దృష్టికి తీసుకెళ్లగా, హొసపేట ఆటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి త్వరలో బోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

హంపిలో గుట్టపై మరో చిరుత ప్రత్యక్షం



బళ్లారి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన హంపిలోని విరూపాక్షి స్వామి అలయ సమీపంలో ఒక గుట్టరాళ్లపై మంగళవారం సాయంత్రం ఒక చిరుత ప్రత్యక్షమైంది. చల్లటి వాతావరణం మేఘాలు కదిలిపోతున్న వేళ చిరుత కొండపై ప్రశాంతంగా కూర్చుని పర్యాటకులను చూస్తువుంది. చిరుతను చూసిన పర్యాటకులు అక్కడ నుండి పరుగులు తీశారు.

హోసూరు జోన్

పంట సాగు విస్తీర్ణం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అపూర్వ

హోసూరు(కృష్ణగిరి) జూలై 9: కృష్ణగిరి జిల్లాలో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించి సాగు విస్తీర్ణం రెట్టింపు చేసి రైతులకు మేలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టమోటా, కీరదోసలను శాశ్వత పంటలుగా మార్చడానికి నిర్ణయించామన్నారు. రైతులకు మేలు జరిగేలా లక్ష్యాన్ని పెంచి ఉత్పత్తిని పెంచాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. అలాగే వ్యవసాయోత్పత్తి కమీషనర్, ప్రభుత్వ సెక్రటరీ అపూర్వ మాట్లాడుతూ బంజరు భూములను వ్యవసాయ యోగ్యమైన భూములుగా మార్చేందుకు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. సమావేశంలో డైరెక్టర్ పి.శంకరలింగం, వ్యవసాయ సెంట్రల్ ప్లానింగ్ అడ్మిషనల్ డైరెక్టర్ శంకర్ సుబ్రమణ్యం, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ భూపతి, వ్యవసాయ శాఖ అసోసియేట్ డైరెక్టర్ సి.పచ్చయ్యప్పన్, డిప్యూటీ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సెందిల్‌కుమార్, హార్టికల్చర్ కళాశాల రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ డార్టర్ అనిషారాణి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రిబిజినెస్ శివానందం తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హోసూరు, జూలై 9: హోసూరు సబ్‌స్టేషన్ నుంచి వచ్చే ఫీడర్లలో అత్యవసర పనులు చేపట్టేందుకు జూలై 11 న విద్యుత్ సరఫరా ఆపివేయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తారు. సబ్ స్టేషన్ ముల్లైనగర్, కార్పొరేషన్ కార్యాయలం, ఆనంద్ ఎలక్ట్రానిక్స్, మారుతీ నగర్, సీతారాం నగర్, నరసింహ కాలనీ, పాత బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒక ప్రకటనల్లో తెలిపారు.

ద్విచక్రవాహనాల చోరీ

హోసూరు, (క్రైం) జూలై 9 అర్ధరాత్రి ఇంటి సమీపంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఇద్దరు నిందితులు దొంగతనానికి పాల్పడిన సీసీటీవి ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోసూరు నేహ్రూ నగర్‌లో రవికుమార్, విఘ్నేష్‌లు తమ ఇంటి ముందు పార్క్ చేస్తారు. అలానే సోమవారం రాత్రి పార్క్ చేశారు. తెల్లవారి చూసేసరికి అవి చోరీకి గురయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నూతన ఆటోస్టాండ్ ప్రారంభం

హోసూరు జూలై 9: హోసూరు సమీపం మత్తిగిరి కూట్‌రోడ్డులో బీజేపి ఆధ్వర్యంలో నూతన ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ హాజరై నేమ్ బోర్డును ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, యూత్ లీగ్ జిల్లా అధ్యక్షుడు వీరేంద్ర మీడియా విభాగం అధినేత మల్లేష్ రెడ్డి, యూత్ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు పాల్గొన్నారు.



నూతన ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న నేతలు

అక్రమాలకు అడ్డుకట్ట: ఎస్పీ

రాయచూరు, జూలై 9 : జిల్లాలో అక్రమ ఇసుక దందాతో పాటు చట్టవిరుద్ధంగా జరిగే ఎలాంటి కార్యకలాపాలను సహించబోనని జిల్లా నూతన ఎస్పీ పుట్టమాదయ్య స్పష్టం చేశారు. మంగళవారం జిల్లాలోని ముదగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మొహరం శాంతిసభలో పాల్గొన్న అనంతరం ఎస్పీ ఐజీని కలిసేందుకు బళ్ళారికి వెళుతున్న సందర్భంగా కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న మట్కా, జూదం, ఆన్‌లైన్ మోసాలు తదితర వాటన్నింటిపై త్వరలోనే సమావేశం నిర్వహించి సమగ్ర వివరాలు సేకరిస్తామన్నారు. ఇలాంటివాటిని జిల్లాలో అనుమతించబోమని బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న నూతన ఎస్పీ పుట్టమాదయ్య

తరగతి గది పైకప్పు కూలి ఇద్దరు విద్యార్థులకు గాయాలు

రాయచూరు, జూలై 9: జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి సమీపంలోగల ఆన్వరి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గది పైకప్పు కూలింది. తొలుత పెచ్చులూడిపడడంతో అప్రమత్తమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు బయటికి వెళ్లడంతో కప్పుకున్న పెచ్చులుపడి అనంతరం ఇద్దరు బాలలకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ పాఠశాల గదిని రెండేళ్ల క్రితమే నిర్మించగా పనులు నాసిరకంగా జరపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ ఆరోపించారు. విద్యార్థుల తలకు బలమైన గాయాలై కుట్లు పడినా అటు ఉపాధ్యాయులు ఇటు అధికారులు బయటికి చెప్పకపోవడంపట్ల ఆయన అభ్యంతరం తెలిపారు. ప్రాథమిక చికిత్సనందించి విద్యార్థుల తల్లిదండ్రులను బయటికి విషయం చెప్పకుండా మ్యానేజ్ చేశారని ఆరోపించారు. అధికారులు జోక్యంచేసుకుని విద్యార్థులకు జరిగిన వైద్య చికిత్స ఖర్చులను కాంట్రాక్టర్‌ల నుంచి ఇప్పించాలన్నారు. నాసిరకంగా తరగతి గదులు నిర్మించిన కాంట్రాక్టర్‌కు జరిమానా విధించి తిరిగి పనులు పూర్తి చేయాలని ఆదేశించాలన్నారు.



పెచ్చులూడిన పాఠశాలగది పైకప్పు, గాయపడిన విద్యార్థి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కె.శ. శంకరనారాయణ కాయ్...

పీసపాటి నరసింహమూర్తి (జయంతి)



నాటకరంగ ఘనాపాఠిగా పేరొందిన పీసపాటి నరసింహ మూర్తి 1920 జూలై 10న విజయనగరం జిల్లా బలిజపేట మండలం వంతరాం గ్రామంలో జన్మించారు. నాటకరంగంలో 'శ్రీకృష్ణుడు' పాత్రధారిగా తనకంటూ ప్రత్యేకస్థానాన్ని కల్పించుకున్నారు. పద్యగానంలో తనదైన ఒరవడిని సృష్టించారు. ప్రారంభంలో ఆకాశవాణిలో పనిచేశారు. 'రంగూన్ రౌడీ'లో కృష్ణమూర్తి పాత్రద్వారా నాటకరంగంలోకి అడుగుపెట్టారు. రెండుసార్లు సంగీత నాటక అకాడమీలో సభ్యత్వం ఇచ్చి గౌరవించింది. ఏడుదశాబ్దాలపాటు వేలాది ప్రదర్శనలు ఇచ్చి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. విశిష్ట పురస్కారం, 'కళాప్రపూర్ణ' గౌరవాన్ని అందుకున్నారు. 2007 సెప్టెంబరు 28న కన్నుమూశారు.

కేతు విశ్వనాథరెడ్డి (జయంతి)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కేతు విశ్వనాథ రెడ్డి 1939 జూలై 10న వైఎస్ఆర్ జిల్లా కమలాపురం తాలూకా రంగశాయిపురం గ్రామంలో జన్మించారు. సాహితీవేత్త, విద్యావేత్తగా పేరొందారు. సీమ బడుగు బతుకులకు, వెతలకు ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రత్యేకపీట వేసిన ప్రతిభాశాలి. ప్రత్యేకించి కడప జిల్లా ఊళ్ల పేర్ల పూర్వాపరాలపై నిశిత అధ్యయనంతో పీహెచ్‌డీ అందుకున్నారు. పాఠ్య పుస్తకాల రూపకల్పనలో ఎస్‌సీఈఆర్‌టీ సంపాదకులు. కథా సంపుటాలు వెలువరించారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డైరెక్టర్‌గా రిటైరయ్యాక 'ఈ భూమి' పత్రిక సంపాదకులుగా వ్యవహరించారు. ఆయన రచనలు పలు భాషలలోకి అనువాదమయ్యాయి. తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు తదితర అవార్డులు పురస్కారాలు అందుకున్నారు. 2023 మే 22న కన్నుమూశారు.

అలైస్ మన్రో (జయంతి)




కెనడా దేశానికి చెందిన చిన్న కథల రచయిత్రి అలైస్ అన్ మన్రో 1931 జూలై 10న జన్మించారు. 2013లో సాహిత్యానికి 'నోబెల్ పురస్కారం' అందుకున్నారు. ఫిక్షన్ కథలలో గొప్ప రచయిత్రిగా రాణించారు. మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్, కెనడా ప్రభుత్వంచే మూడుసార్లు 'గవర్నర్ జనరల్స్ అవార్డు' అందుకున్నారు. రైటర్స్ ట్రస్ట్ ఆఫ్ కెనడాచే 1996లో మరియన్ ఏంజెల్ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2024 మే 13న కన్నుమూశారు.

సునీల్ గవాస్కర్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత సునీల్ మనోహర్ గవాస్కర్ 1949 జూలై 10న బాంబేలో జన్మించారు. టెస్ట్ క్రికెట్‌లో 'ఉత్తమ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్'గా రాణించారు. 'షెరిఫ్ ఆఫ్ ముంబై'గా గుర్తింపు పొందారు. పలు వరల్డ్ రికార్డ్స్ సృష్టించారు. టెస్ట్‌మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌లో సెంచరీలను రెండుసార్లు సాధించారు. 10వేలకు పైగా పరుగులు నమోదు చేశారు. 34 టెస్ట్ సెంచరీలు చేసిన ఘనత రెండు దశాబ్దాలపాటు కొనసాగగా దీన్ని సచిన్ టెండూల్కర్ 2005లో అధిగమించారు. క్రికెట్ కామెంటేటర్‌గాను రాణించారు. 'పద్మశ్రీ', కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం, ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలోనూ చోటు దక్కించుకున్నారు. ఆటో బయోగ్రఫీతోపాటు క్రికెట్‌పైన నాలుగు పుస్తకాలు రాసి ప్రత్యేకత చాటుకున్నారు.

రాజ్‌నాథ్‌సింగ్ (పుట్టినరోజు)



ప్రస్తుతం కేంద్ర రక్షణశాఖ మంత్రిగా కొనసాగుతున్న రాజ్‌నాథ్‌సింగ్ 1951 జూలై 10న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం చౌందేలీ జిల్లా బాభౌరి అనే గ్రామంలో జన్మించారు. బీజేపీలో ప్రముఖ నేతలలో ఒకరు. ఆర్‌ఎస్‌ఎస్‌లో స్వయంసేవక్‌గా కెరీర్‌ను ప్రారంభించి ఉన్నత పదవులు అందుకున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ప్రధాని వాజ్‌పేయ్ కేబినెట్‌లో కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. ప్రధాని నరేంద్రమోదీ కేబినెట్‌లో తొలుత హోం మంత్రిగా వ్యవహరించారు.

కోట శ్రీనివాసరావు (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కోట శ్రీనివాసరావు 1943 జూలై 10న విజయవాడలో జన్మించారు. తెలుగు నాటక రంగంలో రాణించి వెండితెరపై సత్తా చాటుకున్నారు. తెలుగు సహా తమిళ, కన్నడ, హిందీ, మళయాళం భాషలలో 750కుపైగా సినిమాలలో నటించారు. ఉత్తమ కేరక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గాను 9నంది అవార్డులు, స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్నారు. 'విజయవాడ తూర్పు' నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అల్లు రామలింగయ్య పురస్కారం పొందారు. 'కృష్ణం వందే జగద్గురుం'లో బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా సైమా అవార్డు పొందారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్, జూలై 9: సైబర్ నేరాలు ఇటీవలిగా అధికమయ్యాయనీ, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక డీపీలో పోలీసు అధికారులతో కలసి ఎస్పీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్, ట్రేడింగ్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకుఖాతా వివరాలు ఎవ్వరికీ ఇవ్వకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల ఆశలు చూపి, జనం డబ్బు లూటీ చేస్తున్నారన్నారు. మొబైల్ ట్రేడింగ్ యాప్‌లతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని నిరుద్యోగులు, యువతీయువకులకు షేర్‌మార్కెట్ యాప్‌ల ద్వారా వాట్సాప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ చేస్తుంటారన్నారు. వీటిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఒంటరిగా ఉంటున్నామనీ, ఫ్రెండ్ కావాలని మెసేజ్‌లు పంపుతుంటారనీ, వాటిని ఎవరూ నమ్మవద్దన్నారు. ప్రజలను ముగ్గులోకి దింపి, న్యూడ్ వీడియో కాల్స్ రికార్డు చేసి డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తారని హెచ్చరించారు.

భూముల పరిహారంలో రైతులకు న్యాయం చేయాలి

జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్‌గౌడ డిమాండ్



ప్లకార్డులతో రైతుల నిరసన

దొడ్డబళ్లాపుర, జూలై 9: తాలూకాలోని కోనఘట్ట వద్ద రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి మండలి (కేఐఏడీబీ) స్వాధీనం చేసుకున్న రైతుల భూములకు న్యాయమైన, శాస్త్రీయ పరిహారం అందించడంలో అధికారులు విఫలమయ్యారు. రైతులు నిర్వహిస్తున్న పోరాటం 176వ రోజుకు చేరుకున్నా అధికారుల్లో చలనం లేదని రాష్ట్ర జేడీఎస్ ప్రధాన కార్యదర్శి హరీశ్‌గౌడ ఆరోపించారు. రైతుల భూములకు సరైన ధరతో పరిహారం అందేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్‌లతో తాలూకా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌గౌడ మాట్లాడుతూ తరతరాలుగా సాగును నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులనుంచి భూములు తీసుకుంటున్నారని అటువంటప్పుడు కనీసంగా న్యాయసమ్మతమైన పరిహారం కోరడంలో తప్పేం ఉందన్నారు. సమస్యలపై కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామికి విన్నవించగా సానుకూలంగా స్పందించారని అయితే కేఐఏడీబీ అధికారులు మాత్రం భూ పరిహారంలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన భూస్వాధీన నిబంధనలు 1:4 ప్రకారమే పరిహారం కోరుతున్నా అమలు చేయలేదన్నారు. జిల్లాఅధికారి పునఃపరిశీలించి రైతులకు న్యాయం చేసేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోనఘట్ట రైతు ఆనంద్ డిమాండ్ చేశారు. అనంతరం ఉపవిభాగాధికారి శ్రీనివాస్, సబ్‌రిజిస్ట్రార్ అనుపమకు వినతిని సమర్పించారు. నిరసనలో ఆదినారాయణ హోసహళ్ళి, నాగదేనహళ్ళి, కోనఘట్ట, కూడహళ్ళి గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి - కృష్ణ - కావేరి నదుల అనుసంధానంతో

కర్ణాటకకు 2.91 టీఎంసీలపై అభ్యంతరం

» ఆదనపు నీటిలో 50 శాతం కేటాయించాలని పట్టు

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గోదావరి, కృష్ణ, కావేరి, పెన్నా నదుల అనుసంధానం ద్వారా కర్ణాటకకు వాస్తవంగా 2.91 టీఎంసీలు మాత్రమే లభించనుందని ఇది తీవ్రమైన అన్యాయమని కర్ణాటక ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈమేరకు తారతమ్యాలను సర్దుబాటు చేయకుంటే ఒప్పందంపై సంతకాలు చేసేది లేదని స్పష్టం చేసింది. రాష్ట్రాలవారీగా నీటి కేటాయింపులను పునఃపరిశీలించాల్సి ఉందని జలవనరులశాఖ అదనపు ముఖ్యకార్యదర్శి, జాతీయ జల అభివృద్ధి సంస్థ డైరెక్టరేట్‌కు జూన్ 19న లేఖ పంపారు. మహానది, గోదావరి పరీవాహకం నుంచి 7వేల మిలియన్ క్యూబిక్ మీటర్ల (ఎంసిఎం) నీటిని కృష్ణ, పెన్నార్, కావేరి నదులకు మళ్లించి 9.44 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటిని అనుకూలం చేసేందుకు సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. బేడతి - వరదానదుల అనుసంధానం కూడా ఈ ప్రస్తావనలో చేర్చారు. రాష్ట్రాలతో చర్చలు జరిపి ఆ తర్వాత పరిష్కారంగా ప్రస్తావనలు సిద్ధం చేయాల్సి ఉంది. అదనపు నీటిని కేటాయించే ప్రమాణంలో 7వేల ఎంసిఎంలనుంచి 4వేలకు తగ్గించారు. నదుల అనుసంధానం వల్ల దక్షిణ రాష్ట్రాలకు 147 టీఎంసీల నీరు లభ్యం కానుంది. రాష్ట్రానికి 10.74 టీఎంసీల నీరు కేటాయించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తాగునీటితోపాటు పరిశ్రమలకు సాగునీటికి ఉద్దేశించి కేటాయింపులు చేశారు. కర్ణాటకలో పరిశ్రమలు, తాగునీటి ఉద్దేశ్యాలకు మాత్రమే నీటి కేటాయింపులు చేశారు. రాష్ట్రానికి వాస్తవంగా 2.19 టీఎంసీల నీరు మాత్రమే లభ్యం కానుంది. మిగిలిన నీరు కిందిభాగంలో ఉండే రాష్ట్రాలకు ప్రవహించనుంది. తద్వారా కర్ణాటకకు అన్యాయం జరుగుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. నదుల అనుసంధానం అమలు చేసేందుకు ముందు రాష్ట్రాలమధ్యన ఒప్పందాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర జల అభివృద్ధి సంస్థ రాష్ట్రాలకు సంబంధిత పత్రాలను పంపింది. ఒప్పందం చేసుకునేందుకు కర్ణాటక నిరాకరించింది. చారిత్రాత్మక కారణాలతో కృష్ణ, కావేరి పరీవాహానికి ఎక్కువ నీరు కేటాయించాల్సి ఉంటుంది. దక్షిణాదిన ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలోనే ఎక్కువ కరువుప్రాంతం ఉంది. అదనపు నీటిలో రాష్ట్రానికి 50శాతం కేటాయించాలని ప్రభుత్వం పట్టుబట్టుతోంది.

మెడికల్ కళాశాలల మంజూరులో డీసీఎంకు చుక్కెదురు

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డీసీఎం డీకే శివకుమార్ సొంతప్రాంతం కనకపుర, రామనగరలలో ఏర్పాటు చేయదలచుకున్న మెడికల్ కళాశాలల విషయంలో చుక్కెదురైంది. రాష్ట్రం నుంచి ఐదు మెడికల్ కళాశాలల అనుమతులకోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి)కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పలు సాంకేతిక కారణాలు చూపుతూ రామనగర, కనకపుర తాలూకాలలో ఏర్పాటు చేయదలిచిన మెడికల్ కళాశాలలకు అనుమతులు లభించలేదు. రామనగరలో రాజీవ్‌గాంధీ మెడికల్ యూనివర్సిటీలో కళాశాల ప్రారంభానికి ప్రస్తావనలు పంపారు. అక్కడ సిబ్బంది కొరతతోపాటు 650 పడకలు మాత్రమే ఉన్నమేరకు అనుమతులు నిరాకరించారు. కనకపురలో మౌలిక సదుపాయాల కొరత కారణంగా అనుమతులు దక్కలేదు. అయితే మూడు కళాశాలలకు అనుమతులు దక్కాయి. వీటిలో బెంగళూరులోని పిఇఎస్ మెడికల్ కళాశాల, బిజిఎస్ మెడికల్ కళాశాల, బాగల్కోటె ఎస్ఆర్ మెడికల్ కళాశాలకు అనుమతులు దక్కాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 70 మెడికల్ కళాశాలలు ఉండగా మరో 3 కొత్తవి చేరడంతో ఆ సంఖ్య 73కు పెరిగింది. వీటి ద్వారా 11,745 మెడికల్ సీట్లు దక్కనుండగా కొత్త కళాశాలలతో 350 సీట్లు పెరిగినట్టయ్యింది. దేశంలో అత్యధిక మెడికల్ కళాశాలలు కల్గిన రాష్ట్రాలలో కర్ణాటక రెండోస్థానంలో నిలిచింది. తమిళనాడులో 74 కళాశాలలు ఉండగా ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో 68, మహారాష్ట్రలో 67, తెలంగాణలో 57 కళాశాలలు ఉన్నాయి.

27 మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ జరిమానా

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాలు సంపూర్ణంగా లేకపోవడం వంటి కారణాలతో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) జరిమానా విధించింది. మౌలిక సదుపాయాలు లేని కళాశాలలకు రూ.2 - 15 లక్షల వరకు జరిమానా విధించగా 5 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు జరిమానా పడింది. వీటిలో చిక్కమగళూరు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర, మండ్య, యాదగిరి మెడికల్ కళాశాలలకు గరిష్ఠంగా వీటికి రూ.15లక్షలదాకా జరిమానా విధించారు. 11 ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు జరిమానాపై వైద్యవిద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్‌పాటిల్ స్పందించారు. కొన్ని మెడికల్ కళాశాలల్లో సౌలభ్యాలు లేనందునే ఎన్ఎంసి చర్యలు తీసుకుందని వాటిని పరిష్కరించేందుకు కార్యాచరణ చేపడతామన్నారు.

రాహుల్ ద్రావిడ్‌కు 'గార్డ్ ఆఫ్ హానర్'

» ఉడుపిలో పూజల్లో సూర్యకుమార్ యాదవ్ దంపతులు



రాహుల్‌ద్రావిడ్‌కు ఆత్మీయ గౌరవం ఇలా...

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టి-20 వరల్డ్‌కప్ విజయానికి ప్రధాన కారకుడైన సూర్యకుమార్ యాదవ్ ఉడుపి జిల్లాలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంగళవారం కాపు మారిగుడి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. దక్షిణకన్నడ జిల్లాకు చెందిన దేవిశాశెట్టితో సూర్యకుమార్ యాదవ్ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. సోమవారం మంగళూరు విమానాశ్రయానికి చేరుకోగా అక్కడే దంపతులు కేక్‌కట్ చేసి 8వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకొన్నారు. మంగళవారం ఉదయం మారిగుడి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. దేవిశాశెట్టి తుళుభాషలో స్థానికులతో మాట్లాడారు. ఇదే సందర్భంగా సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రపంచకప్ ఫైనల్‌లో నేను పట్టిన క్యాచ్ బౌండరీ లైన్ టచ్ కాలేదన్నారు. ప్రపంచ ప్రజలందరినీ సంతోషపరచడం సాధ్యం కాదన్నారు. దేవుడి ఆశీస్సులతోనే నేను అద్భుతమైన క్యాచ్ పట్టానన్నారు. అది కేవలం ఒక క్యాచ్ కాదని నా జీవితాన్ని మార్చిన అద్భుతమన్నారు.

రాహుల్‌ద్రావిడ్‌కు గౌరవం

భారత క్రికెట్ జట్టు కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు గార్డ్ ఆఫ్ హానర్‌తో గౌరవించారు. క్రికెట్ అకాడమీలో మంగళవారం విద్యార్థులు బ్యాట్‌లు ఎత్తి హానర్ అందించారు. 1996 లో ఇంటర్నేషనల్ క్రికెట్‌లో కాలుపెట్టారు. 2012 దాకా జట్టులో కొనసాగారు. ప్రపంచకప్ గెలవాలనేది రాహుల్‌ద్రావిడ్ ఆశయంగా ఉండేది. జట్టుకోచ్‌గా వ్యవహరిస్తూ ప్రపంచకప్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.



ఉడుపిలోని మారిగుడి ఆలయంలో సూర్యకుమార్ దంపతులు

అందుబాటులోకి ఇసుక..

పుట్టపర్తి, జూలై9(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో ఐదేళ్ల సామాన్యులకు ఇసుక అందకుండా పోయింది. టన్ను ఇసుక కొనాలన్నా వేలకు వేల రూపాయలు చెల్లించాల్సిన దుస్థితి కల్పించారు. నాడు ఇసుక అక్రమ రవాణా చేస్తూ వైసీపీ నాయకులంతా రూ.కోట్లకు పడగలెత్తారు. సాధారణ ప్రజలు కొనడానికి వీలులేకుండా చేశారు. టన్ను ఇసుక రూ.475 చొప్పున విక్రయించారు. ఊరూపేరూలేని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టి వారి పేరిట ముఖ్యనేతలే నేరుగా ఇసుక వ్యాపారం చేసి, రూ.వందల కోట్లు పోగేసుకున్నారు. ఇసుక అమ్మకాల్లో ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఇవ్వకుండా నగదు రూపంలో వసూలు చేశారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.5వేలు, లారీ లోడు కావాలంటే రూ.30 వేలదాకా దోపిడీ చేశారు. ఆకాశంలో ఉన్న ఇసుక ధరను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చింది. నామమాత్రపు ధరతో ఇసుకను సరఫరా చేస్తోంది. జిల్లాలో ఐదు ఇసుక స్టాక్‌పాయింట్ల వద్ద 61,300 మెట్రిక్ టన్నుల ఇసుకను అదుబాటులో ఉంచింది. సోమవారం నుంచి జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక సరఫరాను లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి, కదిరిలో కుటాగుళ్ల ప్రారంభం కాగా.. మంగళవారం ఉప్పలపాడు, కొడవండ్లపల్లిలో మొదలు పెట్టారు. నల్లబోయినపల్లి ఇసుక స్టాక్‌పాయింట్ నుంచి మంగళవారం సాయంత్రానికి 1582 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేశారు. ఉప్పలపాడు, కుటాగుళ్ల, కొడవండ్లపల్లి స్టాక్‌పాయింట్ల నుంచి ఇసుక సరఫరా అవుతోంది. అక్రమ రవాణాకు అవకాశం లేకుండా రాష్ట్రప్రభుత్వం నామమాత్రపు ధరతో హ్యాండ్లింగ్ చార్జీలు కలిపి టన్నుకు రూ.277తో సరఫరా చేస్తోంది. ఆన్‌లైన్ చెల్లింపులను అమలు చేస్తోంది. స్టాక్ పాయింట్ల వద్ద క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. స్టాక్ పాయింట్లలోనే కాకుండా ఉపనదులు, వాగులు, వంకల నుంచి ఎడ్లబండ్లపై ఇసుక తరలించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురావడంతో నిర్మాణ రంగంపై ఆధార పడ్డ కార్మిక కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఇంటిముంగిటకు పథకాలే లక్ష్యం : ఎమ్మెల్యే



జనస్పందనలో ప్రజల సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, జూలై 9: ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందేలా చేయడమే జనస్పందన లక్ష్యమని ఎమ్మెల్యే, కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బూదికోటె గ్రామంలో తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో జనస్పందన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గృహలక్ష్మి, గృహజ్యోతి, యువనిధి, శక్తి, అన్నభాగ్య పథకాలను కుల, మతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అన్నభాగ్య పథకానికి బియ్యం నిరాకరించిన కేంద్రప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల వేళ భారత్‌రైస్ ప్రవేశపెట్టి అమలులో విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం వర్షాకాలంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు నిల్వ చేసి రైతులకు సకాలంలో అందించేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరించి వంద పడకల సామర్థ్యం హైటెక్‌గా తీర్చడమే లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా జనస్పందన కార్యక్రమం ఉందన్నారు. ఈ సందర్భంగా 250కుపైగా అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉప విభాగాధికారి డాక్టర్ మైత్రి, తహసీల్దార్ రశ్మి, డీఎస్పీ పాండురంగ, ఈఓ రవికుమార్, బీఈఓ సుకన్యా, సీడీపీఓ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

12న జిల్లా అధికారి కార్యాలయం వద్ద నిరసన

శిడ్లఘట్ట, జూలై 9: పారిశ్రామిక ప్రదేశ విస్తీర్ణం నెపంతో సాగు భూములను రైతులనుంచి లాక్కుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, కేఐఏడీబీ తీరును ఖండిస్తూ ఈనెల 12న జిల్లాధికారి కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్టు రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన రాష్ట్ర కార్యదర్శి భక్తరహళ్ళి బైరేగౌడ వెల్లడించారు. తాలూకాలోని జంగమకోటె హోబళిలో సుమారు 28-29 ఎకరాల భూమిని పరిశ్రమల అభివృద్ధి కోసం స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం సూచించడాన్ని ఖండిస్తూ జంగమకోటె క్రాస్ వద్ద హోసపేటె గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రైతుల సమావేశం నిర్వహించారు. అన్నాన్ని అందించే భూమి అమ్మడం వల్ల రైతుల జీవనం కష్టమవుతుందన్నారు. పరిశ్రమల అభివృద్ధికోసం బంజరు భూములు ఇతర వృథా భూములు స్వాధీనం చేసుకోవాలని అయితే పంటల సాగు చేస్తున్న భూములను లాక్కోవాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పరిశ్రమల అభివృద్ధికి తమ అభ్యంతరం లేదని అయితే పంటల భూములను లాక్కోవాలనుకోడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైతుసంఘం హసిరుసేన తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్, ప్రముఖులు హిత్తలహళ్ళి రమేశ్, సుండ్రళ్ళి బీరప్ప, బసవాపట్టణ బైరేగౌడ, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రూపంతో ఫలపుష్ప ప్రదర్శన

» లాల్‌బాగ్‌లో స్వాతంత్ర్య వేడుకలకు కసరత్తు

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యానవనశాఖ లాల్‌బాగ్‌లో ఏర్పాటు చేసే ఫలపుష్ప ప్రదర్శనలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవనరూపంతో పూల సోయగాలను ఏర్పాటు చేయదలిచారు. ఆగస్టు 8 నుంచి 19వరకు ప్రదర్శనలు కొనసాగనున్నాయి. ఉద్యాన వనశాఖ అలంకరణలకోసం దేశ విదేశీపూలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్లాస్‌హౌస్‌లో అంబేడ్కర్ విగ్రహంతోపాటు కళాఖండాలను ఆయన జీవితంలో ప్రధానమైన ఘట్టాల ఆధారంగా ఫోటోప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. గ్లాస్‌హౌస్‌లో ఓ భాగంగా పార్లమెంటు భవనం, మరోవైపు అంబేడ్కర్ జన్మించిన స్థలం, రాజ్యాంగానికి సంబంధించిన ప్రతులను పూలతో అలంకరించనున్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండు మూడు సభలు జరిగాయి. అంబేడ్కర్ ఆశయాలను పూల ప్రదర్శన ద్వారా యువత, విద్యార్థులకు తెలియపరచడమే ఉద్దేశ్యంగా పెట్టుకున్నారు. లాల్‌బాగ్ అన్ని ప్రధాన గేట్‌లలోనూ ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయదలిచారు. ఫ్లవర్‌షో కోసం కెమ్మణ్ణగుండి, ఊటీలనుంచి 50వేల పూలను తీసుకురాదలిచారు. జూలై చివరినాటికి పూలు బెంగళూరుకు చేరుకోనున్నాయి. ఇతర రాష్ట్రాల, విదేశాలనుంచి కూడా పూలను తెప్పించనున్నారు. అంబేడ్కర్ జీవనవిధానంతో పూల ప్రదర్శన ఏ విధంగా అమలు చేయాలనేది అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ద్వారా సలహాలు తీసుకుంటున్నామని ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్ జగదీశ్ తెలిపారు.

ఎయిర్ ఏషియా ద్వారా సినిమాటిక్ ఇన్ ఫ్లైట్

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దశాబ్దన్నర కాలంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ సేవలందిస్తున్న ఎయిర్ ఏషియా సంస్థ 130 గమ్యస్థానాలకు అనుసంధానం చేస్తోందని చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ పౌల్ క్యారూల్ తెలిపారు. మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఆసియా, ఆస్ట్రేలియాతోపాటు ఇతర అందమైన గమ్యస్థానాలను అన్వేషించేందుకు దేశం నుంచి ప్రయాణికులను ఆహ్వానిస్తోందన్నారు. త్వరలోనే దేశంలోని 16 నగరాల ద్వారా మలేషియా, థాయ్‌ల్యాండ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా 130 గమ్యస్థానాలను కనెక్ట్ చేస్తోందన్నారు. సంస్థ సేవల విస్తరణలో భాగంగా సినిమా ప్రేక్షకులకు వినూత్నమైన అనుభూతిని అందించదలిచిందన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన థియేటర్లలో ఆరు నెలలపాటు ఎయిర్ ఏషియా టికెట్లను గెలుపొందే అవకాశం ఉందన్నారు. 'సినిమాటిక్ ఇన్ ఫ్లైట్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. కొవిడ్ తర్వాత పర్యాటక పునరుద్ధరణ అభివృద్ధి చేసేలా మార్గాలను విస్తరిస్తోందన్నారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నంతోపాటు పలు నగరాలకు విస్తృతమైన సేవా నెట్‌వర్క్ అందిస్తోందన్నారు.

జిందాల్ నుంచి 20 లక్షల కార్మికులకు ప్రయోజనం

బెంగళూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేరొందిన స్టెయిన్‌లెస్ స్టీల్ తయారీ జిందాల్, నైపుణ్యాభివృద్ధి సంస్థ కేపిటల్ గూడ్స్ అండ్ స్ట్రాటజిక్ స్కిల్ కౌన్సిల్ (సీజీఎస్ఎస్) సంయుక్తంగా దేశవ్యాప్తంగా 20లక్షల మందికి నైపుణ్య శిక్షణలు ఇవ్వదలిచారు. ఈమేరకు మంగళవారం కేపిటల్ గూడ్స్ అండ్ స్ట్రాటజిక్ స్కిల్ కౌన్సిల్ సీఈఓ శాలిని సింగ్, జిందాల్ కార్పొరేట్ వ్యవహారాల డైరెక్టర్ విజయ్‌శర్మలు ఒప్పందం చేసుకున్నారు. 14వ ఇండియన్ హౌస్‌వేర్ షో కార్యక్రమంలో హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. విజయ్‌శర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దేశంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌ను సీజీఎస్ఎస్ సాయంతో హౌస్‌వేర్ పరిశ్రమలోకి భాగస్వాములు అయ్యేలా హ్యాండ్‌బుక్ విడుదల చేశామన్నారు. దేశ మంతా కార్మికులకు నైపుణ్యశిక్షణలు ఇవ్వడమే లక్ష్యమన్నారు.

నకిలీ 'భారత్ రైస్' విక్రయాలు



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలివే...

దొడ్డబళ్లాపుర, జూలై 9: కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ రైస్' పేరిట దెబ్బతీసేలా నకిలీ లేబుల్‌తో బియ్యం అమ్ముతున్నట్టు గుర్తించారు. కోలారు నుంచి టెంపోలో పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ మంగళవారం వచ్చిన కొందరు మైక్‌లో అనౌన్స్ చేశారని ఒక వినియోగదారుడు శ్రీనివాస్ గురూజీ ఆరోపించారు. సంచులపై భారత్‌రైస్ అంటూ నకిలీ స్టిక్కర్ అతికించి విక్రయించారన్నారు. ఈ మేరకు సంచుల స్టిక్కర్‌ను గూగుల్‌లో స్కాన్ చేయగా నకిలీగా నిర్ధారించాక పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. అక్కడికి చేరుకున్న దొడ్డబళ్లాపుర పట్టణ పోలీసులు నకిలీ లేబుల్‌తో కూడిన బియ్యం ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.